ప్రజాశక్తి

సోమవారం 27 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

భయపెడుతున్న మొంథా

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం
- విశాఖకు 820 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం
- నేడు తీవ్ర తుపానుగా మారే అవకాశం
- ఇప్పటికే పలుచోట్ల వర్షాలు
- తీరంలో ఎగిసిపడుతున్న కెరటాలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- పిజిఆర్ఎస్ రద్దు
- పాఠశాలలకు సెలవులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ

మొంథా తుపాను భయపెడుతోంది. వాయుగుండం బలపడుతూ గంటకు 5 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతానికి విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 820 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమైనట్టు విశాఖ వాతా వరణ కేంద్రం అధికారులు ఆదివారం సాయంత్రం బులిటెన్‌లో పేర్కొన్నారు. రాగల 12 గంటల్లో ఇది తుపానుగా మారే అవకాశముందని ప్రకటించారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం నుంచి తీరం వెంబడి గాలుల తీవ్రత పెరిగింది. గంటలకు 25 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. సోమవారం వీటి తీవ్రత 75 కిలోమీటర్ల వరకూ పెరగొచ్చని భావిస్తున్నారు. మొంథా ఎఫెక్ట్‌తో ఇప్పటికే అటు భీమిలి నుంచి ఇటు నక్కపల్లి మండల తీర ప్రాంతం వరకూ సముద్ర కెరటాలు ఎగిసి



ఆర్‌కె బీచ్‌తో ఎగిసిపడుతున్న అలలు

పడుతున్నాయి. సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్లలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయకృష్ణన్ ప్రకటించారు. జివిఎంసిలోనూ పిజిఆర్ఎస్ రద్దయింది. రెండు రోజులపాటు



నగరంలో కురుస్తున్న వర్షం

జిల్లాలోని విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. అన్ని విద్యాసంస్థలు విధిగా ఈ ఉత్తర్వులను పాటించాలని కలెక్టర్లు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అన్ని మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు మిగతా 2లో..



రాజేంద్ర ప్రసాద్‌తో కూడిన న్యాయవాదుల బృందానికి వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

మత్స్యకారులకు అండగా..

- రాజయ్యపేటకు కదిలిన న్యాయవాదులు
- గంగపుత్రుల జీవితాలను నాశనం చేయొద్దని ప్రభుత్వానికి హితవు
- బల్క్ డ్రగ్ పార్కుపై నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని వెల్లడి

ప్రజాశక్తి - నక్కపల్లి : ప్రాణాలను, పర్యావరణాన్ని హరించే బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాజయ్యపేట మత్స్యకారులకు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యాన న్యాయవాదులు అండగా నిలిచారు. తగు న్యాయ సహాయం అందిస్తామని భరోసానిచ్చారు. రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన శిబిరాన్ని వారు ఆదివారం సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో న్యాయవాదుల పర్యటన సాగింది. ఆ బృందంలో విజయవాడ హైకోర్టు అడ్వకేట్, పిఠాపురం న్యాయవాదుల సంఘం నాయకులు భాస్కరాచార్యులు, ఐలు విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లు సురేష్, నూకల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, ప్రతినిధులు పూర్ణిమ, కెవై.మణి, సంతోషి, విశాఖపట్నం, గాజువాక న్యాయవాదుల సంఘం ప్రతినిధులు సంతోషి, చిట్టిబాబుతో మిగతా 2లో..

నగదు పరిహారమే చెల్లించాలి

▶ వార్త 5లో..

విశాఖ కీర్తిని విశ్వవ్యాపితం చేయాలి

▶ వార్త 2లో..

అధ్వానంగా రహదారులు

▶ వార్త 3లో..

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

కంచరపాలెంలో ఆటాపాటతో పిఎన్ఎం ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంచరపాలెం మెట్టు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కళారూపాలతో ప్రదర్శన నిర్వహించారు.



కళారూపాలతో ప్రచారం చేస్తున్న పిఎన్ఎం నాయకులు

అధిక ధరలు, పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణ కోసం కళాకారులు గళమెత్తారు. కార్మికుల పొట్టగొట్టే నాలుగు లేబర్ కోడ్స్, ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న స్మార్ట్ మీటర్ల భారాలకు వ్యతిరేకంగా పాటలు పాడుతూ ప్రచారం చేశారు. ఒకపక్క చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగాన్ని పెంచుతూ, మరో పక్క ప్రజల ఆస్తుల్ని కొల్లగొడుతూ పాలకవర్గాలు మతాల పేరున ప్రజలను చీలగొట్టి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకించాలని ప్రజానీకానికి తమ పాటల ద్వారా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, మంగరాజు, షేక్ వల్లి, జిల్లా కార్యదర్శి ఎం.చంటి, సహాయ కార్యదర్శి స్టాలిన్, ఎం.నాగేశ్వరరావు, సరోజిని, పుష్ప, ఒ.విజయ, రాంబాబు, తదితరులు ప్రజల్ని ఆలోచింప జేస్తూ పాటలు పాడారు. వై.అప్పారావు దర్శకత్వంలో ఎల్ఐసి సొమ్ము 33 వేల కోట్ల రూపాయలను అదానికి నరేంద్ర మోడీ కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ 'ఎవడబ్బ సొమ్ము' వీధి నాటికను ప్రదర్శించారు.

ఆద్యంతం అదే సందడి

- విశాఖ వేదికగా ముగిసిన ఐసిసి ఉమెన్ వరల్డ్ కప్ పోటీలు
- చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ విజయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐసిసి ఉమెన్ వరల్డ్ కప్ - 2025 విశాఖలో ఆద్యంతం సందడి నింపింది. పిఎం.పాలెం వద్దగల ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియం ఐదు లీగ్ మ్యాచ్‌లకు వేదికై క్రీడాభిమానులకు అలరించింది. ఈ పోటీలలో చివరి మ్యాచ్ ఆదివారం ముగియడంతో ఈ టోర్నమెంట్‌లో విశాఖకు కేటాయించిన మ్యాచ్‌లు పూర్తయ్యాయి. విశాఖపట్నం ఐదు ముఖ్యమైన లీగ్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. క్రీడాభిమానులకు మధురానుభూతిని అందించింది. స్థానికంగా తొలి మ్యాచ్ ఈ నెల 9వ తేదీన భారత - దక్షిణాఫ్రికా మధ్య జరగగా దక్షిణాఫ్రికా జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 12వ తేదీన భారత్ - ఆస్ట్రేలియా జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేసి భారత జట్టు సాధించిన 330 పరుగుల




షాడ్ కొడుతున్న ఇంగ్లండ్ క్రీడాకారిణి



వికెట్ తీసిన ఆనందంలో న్యూజిలాండ్ క్రీడాకారిణులు

భారీ స్కోరును ఏడు వికెట్లు కోల్పోయి మరొక ఓవర్ మిగిలి ఉండగానే ఆస్ట్రేలియా ఛేదించి విజయం సాధించింది. 13వ తేదీన దక్షిణాఫ్రికా - బంగ్లాదేశ్ జట్లు తలపడగా దక్షిణాఫ్రికా జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 16వ తేదీన ఆస్ట్రేలియా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



విశాఖ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

భయపెడుతున్న మొంథా

సోమవారం ఉదయాన్నే క్షేత్రస్థాయి పర్యటన చేయాలని, అక్కడి అధికారులతో సమావేశాలు నిర్వహించి తుపానును ఎదుర్కునేలా సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అక్కడి అధికారులతో చర్చించిన అంశాలపై 12 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం ఉంటుందని, అధికారులంతా క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను, పరిస్థితులను నివేదించాలని పేర్కొన్నారు. ప్రజలు ప్రయాణాలు రద్దు చేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని కోరారు. గాలులు వీచే సమయంలో చెట్ల కింద, హోర్డింగ్‌ల సమీపంలో నిలబడరాదన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, వేటకు వెళ్లిన వారు తిరిగి ఒడ్డుకు చేరుకోవాలని కోరారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో, కొండ వాలు ప్రాంతాలలో, నది ఒడ్డున నివసించేవారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉన్నందున బీచ్‌లలో స్నానాలకు దిగవద్దని కోరారు. జిల్లాలో వర్షాలు, గాలుల వల్ల ఇబ్బందులు ఎదురైతే కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 0891-2590102నకుగానీ, 0891- 2590100నకుగానీ ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

ఆద్యంతం అదే సందడి

- బంగ్లాదేశ్ తలపడగా ఆస్ట్రేలియా జట్టు అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచి 10 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. చివరిగా ఈ నెల 26న ఇంగ్లాండ్ - న్యూజిలాండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచి న్యూజిలాండ్ జట్టుపై ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నిరాశపరిచిన భారత జట్టు

విశాఖ వేదికగా భారత జట్టు రెండు కీలక మ్యాచ్‌లు ఆడి రెండింటా ఓడింది. దీంతో అభిమానులు ఒకింత నిరాశకు లోనయ్యారు. ఈ నెల 12న ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ ఆస్ట్రేలియా కెప్టెన్ అలిస్సా హీలీ అద్భుతమైన 142 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియాను విజయపథంలో నడిపించింది. హీలీ ప్రదర్శన టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచింది.

ఆస్ట్రేలియా ఆధిపత్యం

విశాఖ వేదికగా ఆస్ట్రేలియా జట్టు అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. భారత్‌పై విజయంతో పాటు ఈ నెల 16న బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయం వారి సెమీ ఫైనల్స్ బెర్త్‌ను ఖరారు చేయడంలో కీలక పాత్ర పోషించింది.

ప్రతిభతో ఆకట్టుకున్న క్రీడాకారిణులు

ఆస్ట్రేలియాకు చెందిన ఎలీస్ పెర్రీ, అలిస్సా హీలీ, భారత్‌కు చెందిన స్మృతి మందాన, హర్మన్ ప్రీత్ కౌర్, దీప్తి శర్మ, దక్షిణాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్, మారిజాన్ కాప్, నాడిన్ డి క్లెర్క్, బంగ్లాదేశ్ కు చెందిన నిగర్ సుల్తానా జోటి, ఫర్గానా హోక్, నహిద అక్తేర్, న్యూజిలాండ్‌కు చెందిన అమెలియా కేర్, సోఫీ డివైన్, సుజీ బేట్స్, ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కివర్ బ్రంట్, సోఫీ ఎకెల్‌స్టోన్, హెథర్ నైట్ వంటి అగ్రశ్రేణి క్రీడాకారిణుల మెరుపులతో విశాఖపట్నం మహిళల అంతర్జాతీయ క్రికెట్‌కు తన అద్భుతమైన ఆతిథ్యాన్ని అందించింది.

ఆర్‌టిసి ఎసి బస్సుల తనిఖీ

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్ : విశాఖపట్నం నుండి బయలుదేరే ఎసి బస్సుల భద్రతా ప్రమాణాలపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లకు బస్సుల్లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఎసి బస్సుల్లో ఉన్న పరికరాలు, అన్ని తనిఖీ చేసి ఏదైనా ఎమర్జెన్సీ వచ్చినప్పుడు ఏం చేయాలో అవగాహన కల్పించారు. ప్రయాణికులకు కూడా జాగ్రత్తలు చెప్పాలని డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు.

మత్స్యకారుని ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 22న చేపల వేటకు వెళ్లి సముద్ర అలలు ఎక్కువ ఉండటంతో తెప్ప తిరగబడి గల్లంతైన పెదజాలారిపేటకు చెందిన రామోలు ఎల్లాజీ ఆచూకీ ఎట్టకేలకు లభించింది. ఎల్లాజీ కాకినాడ జిల్లా తొండంగి మండలం ఉప్పాడ దరి హుకుంపేట వద్ద స్థానిక మత్స్యకారులకు చిక్కాడు. అతన్ని వారు ఒడ్డుకు తీసుకువచ్చి ఆదరించారని ఫిషరీష్ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు మీడియాకు తెలిపారు.

మత్స్యకారులకు అండగా..

(మొదటి పేజీ తరువాయి..) సహ 16 మంది న్యాయవాదులు ఉన్నారు.

మత్స్యకారులను ఉద్దేశించి ఆందోళనా శిబిరం వద్ద సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు. అభివృద్ధి పేరుతో గంగపుత్రుల జీవితాలను పాలకులు నాశనం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి పౌరునికీ నిరసన తెలియజేసే హక్కు ఉందన్నారు. ప్రాణాలను తీసే పరిశ్రమలు అవసరం లేదన్నారు. బల్క్‌డ్రగ్ పార్కు విషయంలో హోం మంత్రి అనిత తీరు ఆక్షేపణీయమన్నారు. మత్స్యకారులు ఏం నేరం చేశారని దోషులుగా, నేరస్తులుగా చూస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. ప్రభుత్వం, పై అధికారులు చెప్పారని ఇష్టం వచ్చినట్లుగా నడుచుకోవద్దని పోలీసులకు సూచించారు. ఎవరిని బెదిరించడానికి పోలీసు కవాతు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అమరావతిలో రైతులు ఉద్యమం చేపడితే అక్కడ కూడా పోలీసులు ఈ విధంగానే ఆంక్షలు విధించి, కవాతు నిర్వహించారని, చివరికి అక్కడ ఏమైందో అందరికీ తెలుసునని అన్నారు. అదే పరిస్థితి పునరావృతం కానుందన్నారు. రాజ్యాంగం గుర్తించిన పౌర హక్కులను, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దన్నారు.

తొలుత మత్స్యకారులు మైలపల్లి మహేష్ బాబు, బొంది రాజేశ్వరి, పిక్కి పైడితల్లి, పిక్కి కొర్లమ్మ, చేపల సోమేష్ తాము ఎదుర్కొంటున్న సమస్యలను న్యాయవాదుల దృష్టికి తీసుకువెళ్లారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే తమ జీవితాలు నాశనం అవుతాయన్న బాధతో తాము శాంతియుతంగా రిలే దీక్షలు చేపడితే పోలీసులు నిర్బంధం ప్రయోగిస్తున్నారని తెలిపారు. హెటిరో కంపెనీ ఏర్పాటు చేయకముందు, చేసిన తర్వాత పరిణామాలను వివరించారు. హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గిపోవడంతో ఉపాధి కోల్పోయామని వాపోయారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిన నాగేశ్వరరావు, చందనాడ ఎంపిటిసి సభ్యులు గంటా తిరుపతిరావు, వైసిపి నాయకులు గోవింద్, రాయవరం మండలం వైస్ ఎంపిపి చోడిపల్లి అప్పన్న, మత్స్యకారులు పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

బివి.రామారావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్: ప్రముఖ పారిశ్రామికవేత్త బలుసు వెంకట రామారావుకు పలువురు నివాళు లర్పించారు. పాతవెంకోజీపాలెం యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఎమ్‌వివి.ప్రెసిడెన్సీ ఆడిటోరియంలో ఆదివారం రామారావు వర్ధంతి నిర్వహించారు. బి.వి.రామారావు కుమారుడు బి.వి.రామ్ నేతృత్వంలో కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, 32వ వార్డ్ కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ, పారిశ్రామిక రంగానికి బి.వి.రామారావు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. మంచి పరిపాలనా దక్షత, దూరదృష్టి కలిగిన చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందరికంటే ముందు 1994 లోనే బి.వి.రామారావు ఆకాంక్షించారన్నారు. కార్యక్రమంలో రామారావు భార్య బలుసు సతీసావిత్రి, కుమారుడు వెంకటరామ్, కోడలు రాధిక, మనవరాలు ధన్వి పాల్గొన్నారు.



రామారావు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఐరన్ టాబ్లెట్లు మింగిన చిన్నారి

కాపాడిన మెడికవర్ వైద్యులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 20 ఐరన్ టాబ్లెట్లు మింగిన రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని మెడికవర్ ఉమెన్,చైల్డ్ హాస్పిటల్ వైద్యులు కాపాడారు. వివరాలను హాస్పటల్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇన్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ మీడియాకు ఆదివారం తెలిపారు. 2 సంవత్సరాల చిన్నారి పొరపాటున సుమారు 20 ఐరన్ టాబ్లెట్లు మింగడంతో వెంటనే తల్లిదండ్రులు భయంతో తమ హాస్పిటల్ ఎమర్జెన్సీ విభాగానికి తీసుకువచ్చారన్నారు. అప్పటికే చిన్నారి అలసటగా, నీరసంగా ఉండి, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడుతోంది. వెంటనే డాక్టర్ సాయిసునీల్‌కిశోర్ (కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్) ఆధ్వర్యంలో అత్యవసర వైద్యబృందం వెంటనే చికిత్స ప్రారంభించారు.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్ కు తరలించి, ప్రత్యేక 'కీలేషన్ థెరపీ' ద్వారా శరీరంలో అధిక ఐరన్‌ను తొలగించామన్నారు. తరువాత లివర్, రెండు ఊపిరితిత్తుల్లోనూ సమస్య నెలకొందని 7 వారాల పాటు ఐసియులో ఉంచి చికిత్స అందించడంతో పూర్తిగా కోలుకుందన్నారు.

నగరంలో ప్రతి లైట్ వెలిగేలా చూడాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: నగరంలో ప్రతి విద్యుత్ లైట్ వెలిగేలా కార్యాచరణ చేపట్టాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ జివిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన నగరంలోని బీచ్ రోడ్డు ప్రాంతంలో కోస్టల్ బ్యాటరీ నుండి తొట్లకొండ వరకూ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలను జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, జివిఎంసి ప్రధాన ఇంజనీరు పివివి సత్యనారాయణరాజు, పర్యవేక్షక ఇంజనీరు సంపత్ కుమార్‌తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. పరిశీలనలో కమిషనర్ ముందుగా కోస్టల్ బ్యాటరీ నుండి తొట్లకొండ వరకూ వెళ్లే బీచ్‌రోడ్‌లోని వెలగని వలువీధి లైట్లను గుర్తించి, వాటి నిర్వహణపై సంబంధిత ఎలక్ట్రికల్ విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. తక్షణమే వెలగని లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. నగరంలో ప్రధాన కూడళ్ళు, హైవేలు, ప్రధాన రహదారులు, బీచ్ రోడ్, కాలనీల్లో నిత్యం లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ విభాగం సహాయక ఇంజనీర్లను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 49 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు (ఎలక్ట్రికల్) ను వర్కింగ్ అరేంజ్‌మెంట్ ఆధారంగా ప్రతి ఇద్దరు వార్డులకు ఒకరిని ఇన్‌చార్జ్‌గా నియమించామని, వారు నగరంలోని వీధి దీపాల సంరక్షణ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించేలా చూడాలని అన్నారు.

విశాఖ కీర్తిని విశ్వవ్యాపితం చేయాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖపట్నం కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేయాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆకాంక్షించారు. ఆదివారం విశాఖ పోలీస్ బేరక్స్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించిన 'జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 (వావ్)' పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించి విశాఖ కీర్తిని విశ్వ వ్యాప్తంగా చాటాలని పిలుపునిచ్చారు. పోటీల్లో విజేతలకు ఆయనతో పాటు వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ కమల్‌బైద్, మాజీ ఎడిసిపి మహమ్మద్‌ఖాన్ తదితరులు స్వర్ణ, కాంస్య, రజత పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన క్రీడాకారులను డిసెంబర్ 13, 14వ తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమా నికి విశిష్ట అతిథిగా హాజరైన 'వావ్' చీఫ్ ప్యాట్రన్, వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్‌చైర్‌పర్సన్ డాక్టర్ కమల్‌బైద్ మాట్లాడుతూ, ఆర్థిక స్తోమత లేని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తూ 'వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ (వావ్)'ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాను ఛైర్‌పర్సన్‌గా, నండూరి రామకృష్ణ, శుభోదకుమార్ రాకేచ, కపిల్ అగర్వాల్, మంగా వరప్రసాద్, సీహెచ్. శ్రీనివాసరాజును ధర్మకర్తలుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఇందులో 5కి.మీ వాకింగ్, 100 నుంచి 5వేల మీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్క్ త్రో, జావెలిన్ త్రో, హేమర్ త్రో తదితర పోటీలు జరిగాయి. ఈ పోటీలు వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కమల్ బైద్ , వావ్ పిఆర్ఒ వంశీ చింతలపాటి, కార్యదర్శి ఎల్. సుధాకర్, కోశాధికారి ఎం. రామారావు సారధ్యం లో నిర్వహించారు.



వెటరన్ క్రీడాకారులతో సిపి శంఖబ్రత బాగ్చీ

అధ్వానంగా రహదారులు

- పైకి లేచిన యుజిడి మాన్యువల్స్
- ఇబ్బందులు పడుతున్న రామకృష్ణాపురం స్థానికులు



నీటితో చిత్తడిగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - ఆరిలోవ : సుమారు 700 కుటుంబాలు, అందరూ నిరుపేదలే. కొన్ని దశాబ్దాల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఈ కాలనీలో మౌలిక వసతుల కల్పనలో ముందు నుంచి చిన్న చూపే కనిపిస్తోంది. ఈ కాలనీలో నివాసాలకు పట్టాలు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని గత కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. అయినా పాలకులకు, అధికారులకు పట్టడంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. జివిఎంసి 13వ వార్డు పరిధి బిఆర్‌టిఎస్ రహదారిని ఆనుకొని కేంద్రకారాగారం ఎదురుగా ఉన్న రామకృష్ణాపురం దుస్థితి ఇది. రహదారులు నిర్మిస్తామని గత ప్రభుత్వంలో ముందుగా యుజిడి పనులు, కాలువలు నిర్మించారు. ఎలక్షన్ కోడ్ వచ్చిందని పనులు ఆపేసారు. అప్పటి నుంచి సుమారు 17 నెలలు గడిచినా పనులు ప్రారంభించలేదు. దీంతో తవ్వేసిన రహదారులు, పైకి లేపేసి వుంచిన మ్యాన్యువల్స్‌తో స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే చాలు ఈ రహదారులు చిత్తడి చిత్తడిగా మారి స్థానికులకు అసౌకర్యంగా తయారయ్యాయి. ద్విచక్రవాహనాలు అదుపు తప్పి మ్యాన్యువల్స్ దిమ్మలను ఎక్కించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్థానిక కార్పొరేటర్‌కు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎక్కువ జనాభా నివాసం లేని దారపాలెం వంటి ప్రాంతాల్లో రహదారులు నిర్మిస్తున్నారు కానీ సుమారు 3 వేలు జనాభా ఉన్న చోట కనీస మౌలికవసతులు కల్పించడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలనీ రహదారులు పూర్తి స్థాయిలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



రామకృష్ణాపురంలో పైన ఉన్న యుజిడి మాన్యువల్స్

నేరాలు ఘోరాలు

చెరువులో జారి పడి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ నారపాడు గ్రామానికి చెందిన నరవ అప్పలరాజు (45) బహిర్భూమికి వెళ్లి కాలుజారి చెరువులో పడిపోయి గల్లంతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం, నారపాడుకు చెందిన అప్పలరాజు కార్పెంటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లి చెరువులో దిగే సమయంలో కాలు జారిపడి గల్లంతయ్యాడు. అందరూ చూస్తుండగానే నీటిలో మునిగిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఎంతగాలించినా అప్పలరాజు ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో బంధువులు కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అప్పలరాజుకు భార్య నరవ దేవి కుమార్తె ప్రవల్లిక, కుమారుడు గౌతమ్ ఉన్నారు. ప్రవల్లిక 9వ తరగతి, కుమారుడు గౌతమ్ మూడవ తరగతి చదువుతున్నారు. అప్పలరాజు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక సిఐ జి రామచంద్రరావును వివరణ కోరగా అప్పలరాజు చెరువులో గల్లంతుపై ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిసిపి లతా మాధురి

కేసులో వీడిన మిస్టరీ

ఇద్దరు అంతర్రాష్ట దొంగల అరెస్ట్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో ఈ నెల 13వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వక్తి కేసును పోలీసులు ఛేదించారు. పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారించి ఇద్దరు అంతర్రాష్ట దొంగలను అరెస్టు చేసి, రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి గాజువాక స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో క్రైమ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లతా మాధురి మాట్లాడుతూ, చత్తీస్‌గడ్ రాష్ట్రం, మహాసముంద్ జిల్లా, సరై పాలి గ్రామానికి చెందిన ఇంద్రపాలు (27), రతి నాయక్ (25)లు హత్యకు గురైన మీరాజ్ హుస్సేన్‌ను ఈనెల 13వ తేదీన ఒడిశా రాష్ట్రంలోని రాయగడ బ్రిడ్జి వద్ద కలుసుకొని అతని ట్రక్కులో కరడా చెక్ పోస్ట్ వద్ద ఎక్కారు. గాజువాక ఆటోనగర్ వచ్చారు. ముగ్గురు కలిసి గాజువాక ఆటోనగర్‌లో మద్యం తాగారు. మీరాజ్ హుస్సేన్ వద్ద నగదు ఉన్నట్లు గుర్తించి ఆ నగదు, మొబైల్ ఫోను దొంగలించే క్రమంలో మీరాజ్ హుస్సేన్‌ను ఇంద్రపాలు, రతినాయక్ ఇనుపరాడ్‌తో బలంగా కొట్టారు. దీంతో మీరాజ్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత ఇద్దరూ హుస్సేన్ వద్ద ఉన్న రూ.7 వేలు, రిస్ట్ వాచి, మొబైల్ ఫోను తీసుకొని దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలులో పరారయ్యారు. ఇంద్రపాల్ ఒడిశా రాష్ట్రం సబల్‌పూర్‌లో కూడా హత్య చేసి రూ.5 వేలు దొంగలించినట్లు తమ దర్యాప్తులో తేలినట్లు తెలిపారు. సరైపాలి పోలీస్ స్టేషన్లో వీరిపై దోపిడీ కేసులు ఉన్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. అనుమానాస్పద మరణాన్ని ఛేదించిన గాజువాక పోలీసు బృందాన్ని డిసిపి అభినందించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-మధురవాడ : పిఎం.పాలెం ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎసిపి అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. పిఎం.పాలెం స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆగస్టు 23వ తేదీన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ కవర్ చేస్తున్న కోమరెడ్డి ఫణిచేతన్ తన మ్యాచ్ కవర్ చెస్తున్నప్పుడు రూ.3 లక్షల విలువైన సోని లెన్స్ కెమెరా పోయిందని పిఎం పాలెం క్రైం స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసిన పిఎం పాలెం నేరవిభాగం పోలీసులు సిసి కెమెరాల ద్వారా కొంత మందిని గుర్తించారు. గాండీవం యాప్ ద్వారా సెర్చ్ చేసి నిందితుడు మహ్మద్ ముస్తక్ హుస్సేన్‌గా గుర్తించారు. భోగాపురంలో ఓ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న ఆయన అక్కడి నుండి తన సొంతగ్రామమైన కర్నాటకలోని రాయచూరు వెళ్లి పోయాడు. మొబైల్‌ను ట్రాక్‌లో ఉంచగా ఆదివారం క్రికెట్ మ్యాచ్ చూడటానికి ఎసిఎ, విడిసిఎ స్టేడియం వద్దకు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో అక్కడికి వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో నేర విభాగం సిఐ బిఎస్ఎస్.ప్రకాష్, ఎస్ఐ రంభ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌర సంక్షేమ సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -మధురవాడ : పౌర సంక్షేమ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులు ఎల్ఎన్.నాయుడు, సలహాదారులు డాక్టర్ ఎస్.రమేష్ అధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా నాగోతి సూర్య ప్రకాష్, ఉపాధ్యక్షులుగా బెల్లపు పాపారావు, బయపల్లి సతీష్‌కుమార్, కార్యదర్శిగా శ్రీపాద వెంకటరమణ, సంయుక్త కార్యదర్శులుగా పోలిశెట్టి నాగేశ్వరరావు, మామిడి సతీష్ కుమార్, కోశాధికారిగా జగన్మోహన్‌చౌదరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తోట ఆషా స్వరూప్, మరి కొందరు సభ్యులు ఎన్నికయ్యారు.

తీరం... అప్రమత్తం

ప్రజాశక్తి -భీమునిపట్నం : తుపాను నేపథ్యంలో మత్స్యకారులను అప్రమత్తం చేసేందుకు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు ఆదివారం తీర ప్రాంతంలో పర్యటించారు. తీరంలోని మంగమారిపేట, పెద ఉప్పాడ, భీమిలి ప్రాంతాల్లో పర్యటించి మత్స్యకారులు, మత్స్యకార నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మండలంలో 185 సంప్రదాయ బోట్లు, 276 ఇంజను బోట్లు ఉండగా, ఈ నెల 29వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని ఆయా బోటు యజమానులకు, మత్స్యకారులకు రుషి కొండ మెరైన్ సిఐ శ్రీనివాసరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆర్.ఈశ్వరరాజు సూచించారు. తుపాను ప్రభావం వల్ల గాలులతో పాటు భారీ వర్షాలు, అలల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని మత్స్యకారులకు సూచించారు.

సందర్శకులకు అనుమతుల్లేవు..

తుపాను నేపథ్యంలో పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులకు, సందర్శకులకు అనుమతులు నిలిపివేశారు. స్థానిక కొబ్బరి తోట పార్కు, భీమిలి బీచ్‌లోని పలు పార్కుల్లో సందర్శకులను పోలీసులు ఆదివారం అనుమతించలేదు.

భీమిలి వైసిపి ఉపాధ్యక్షునిగా అప్పలనాయుడు

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండల వైసిపి నూతన ఉపాధ్యక్షునిగా అక్కరమాని అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావును ఆదివారం అప్పలనాయుడు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ప్రమాద స్థాయిలో తాటిపూడి జలాశయం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని గోస్తనీ నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న పొట్నూరు, విలాస్‌ఖాన్‌పాలెం, మద్ది, పాండ్రంగి, కృష్ణాపురం, సామయ్యవలస, మునివానిపాలెం, ఆనందపురం మండలం బోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హెచ్చరించారు. తాటిపూడి జలాశయం గరిష్ట నీటి మట్టం 297 అడుగులు కాగా, ప్రస్తుతం తాటిపూడి జలాశయం నీటి మట్టం 295.80 అడుగులు ఉందని తెలిపారు. ప్రస్తుతం జలాశయంలోకి వరద నీరు సుమారు

అప్రమత్తంగా ఉండాలి : ఇఇ

3675 క్యూసెక్కులు వచ్చి చేరుతోందని, స్పిల్ వే గేట్‌ను తెరచి గోస్తనీలోకి సుమారు 4257 క్యూసెక్కులు వరద నీటిని విడిచిపెడుతున్నట్లు వివరించారు. 'మొంథా తుపాన్' హెచ్చరికల నేపథ్యంలో సోమవారం రెండో గేటు కూడా తెరిచి నీటిని విడిచిపెట్టనున్నట్లు తెలిపారు. గోస్తని నది పరివాహక, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.7,500 ఇవ్వాలి

ప్రజాశక్తి -తగరపువలస : పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.7.500 ఇవ్వాలని పెన్షనర్ల సంఘం నాయకులు కానూరి రాంబాబు డిమాండ్‌చేశారు. స్థానిక చిట్టివలస జూట్ మిల్లు కల్యాణ మండపంలో ఆదివారం చిట్టివలస ప్రాంత ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కానూరి రాంబాబు మాట్లాడుతూ, పెన్షనర్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే ఈ వయసులో కనీస పెన్షన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బాబాజీ మాట్లాడుతూ, కనీస పెన్షన్‌పై ఎంపీలు, అధికారులకు వినతిపత్రాలు అందించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో చలనం లేదని, మొండి వైఖరిగా ఉన్నాయని విమర్శించారు. అప్పారావు, మోర అప్పలరాజు మాట్లాడుతూ, డిసెంబర్ 9, 10తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్ల అప్పారావు, పి.సూర్యనారాయణ, ముత్యాలు, కర్రి రాము, నర్సింగరావు, కె.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ...

పలుచోట్ల వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఆదివారం పలుచోట్ల నిర్వహించారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు అధ్యక్షులు మెంటి మహేష్ ఆధ్వర్యంలో చినముషిడివాడ జంక్షన్‌లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో చేపట్టబోయే ప్రజా ఉద్యమ ర్యాలీ పోస్టర్‌ను పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.చినఅప్పలనాయుడు, పైలా సన్యాసి రాజు, కోడిగుడ్ల దేవి సాంబ, గండి రవికుమార్, బంధం నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి కప్పరాడ, బాపూజీ నగర్‌లో వార్డు వైసిపి అధ్యక్షులు కె.సుకుమార్ ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, నాయకులు మొల్లి అప్పారావు, కటుమూరి సతీష్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం చందక పంచాయతీలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బంక సత్యం, బంక శ్రీను, లోలుగు రాజు, గుసిడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వైసిపి విద్యార్థి విభాగం విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు గరికిన వెంకటేష్ ఆధ్వర్యంలో 34వ వార్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరై కరపత్రాలు అందజేసి ప్రజల నుండి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో సనపల రవీంద్ర భరత్, ఉండ రమణ, లింగం శ్రీను, కారి దానియమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

సంతకాల సేకరణ వేగవంతం చేయండి

మునగపాక: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ప్రజా ఉద్యమం ద్వారా చేపట్టే కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ శ్రేణులతో సమావేశమై, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, మల్ల సంజీవరావు, ఆడారి కాశిబాబు, పెంటకోట శ్రీను పాల్గొన్నారు.

సినర్జీస్ సమస్యలపై అదీప్‌రాజ్‌కు వినతి

ప్రజాశక్తి-పేపగుంట : దువ్వాడ విసెజ్ పరిధిలోని సినర్జీస్ కాస్టింగ్స్ కంపెనీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆదివారం రాంపురంలోని వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజుకు కార్మికులు అందించారు. జీతభత్యాలు, బోనస్, పిఎఫ్ తదితర సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ, కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ అన్ని విధాలా మద్దతును అందజేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మికులు జగన్, వెంకట అప్పారావు, రమేష్ ఉన్నారు.

94వ వార్డు వైసిపి అధ్యక్షులుగా నరసింగరావు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు వైసిపి అధ్యక్షులుగా మరో సారి తామర్ల నరసింగరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాంపురంలోని వైసిపి కార్యాలయంలో నరసింగరావును మాజీ ఎమ్మెల్యే అభినందించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నరసింగరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో సురేష్, సూరిశెట్టి సూరిబాబు, బి.కనకరాజు, హరి, నరవ బుజ్జి పాల్గొన్నారు.

రాధాకృష్ణ మహోత్సవానికి హాజరుకావాలి

ప్రజాశక్తి- ములగాడ : ఆర్‌కె.బీచ్‌లో నవంబర్ 5వ తేదీన జరిగే రాధాకృష్ణ మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ యాదవ జగ్గరాజుపేటలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తొనంగి వెంకటరమణ మాట్లాడుతూ, నవంబర్ 5వ తేదీన యాదవ సోదరులందరూ పెద్ద ర్యాలీగా బయలుదేరి ఆర్‌కె.బీచ్ వద్దకు చేరుకొని రాధాకృష్ణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడిసి కృష్ణ, నమ్మి ప్రసాద్, గొంప లక్ష్మి, పల్లా చినతల్లి, ఒమ్మి ఈశ్వరి, ఏదురు అనురాధ, మెల్లి రాజేశ్వరి పాల్గొన్నారు.

రాంబాబుకు అదీప్‌రాజు పరామర్శ

ప్రజాశక్తి-పేపగుంట : గత కొంత కాలంగా వెన్నుపూస సంబంధిత సమస్యతో బాధపడుతున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బల్ల రాంబాబును గౌతమ్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడిగుడ్ల దేవి, 94వ వైసిపి అధ్యక్షులు తామర్ల నరసింగరావు, సాంబ, మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి శ్రీను, నాయకులు సూరిశెట్టి సూరిబాబు, కోతన రామకృష్ణ, నరవ బుజ్జి, బి.కనకరాజు, బొడ్డపల్లి హేమంత్ కుమార్, జతిన్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలలపై వైసిపి ప్రచారాన్ని తిప్పికొట్టండి

ప్రజాశక్తి -గాజువాక : పిపిపి మోడల్‌లో నిర్మిస్తున్న వైద్య కళాశాలలపై వైసిపి చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎపిఐఐసి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గాజువాక నియోజకవర్గం తెలుగు యువత ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం పిపిపిపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ, పేదల పిల్లలు డాక్టర్లు కావాలనే గృహ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిపిపి విధానాన్ని వైసిపి తప్పుదోవ పట్టిస్తోందని తెలిపారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే ఓర్వలేక విషం చిమ్ముతుందన్నారు. పిపిపి మోడల్‌లో పేద పిల్లలకు కళాశాలలలో ఫ్రీ సీట్లు పెరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో 65వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గణపతి, ములకలపల్లి పెంటయ్య, నాయకులు పల్లా కుంచరావు, వియ్యపు కొండబాబు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాదుల శ్రీనివాస్

అనంతుని దర్శించుకున్న సందీప్ కుమార్

ప్రజాశక్తి- పద్మనాభం : ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్, జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండ దిగువన ఉన్న కుంతీ మాధవస్వామిని కూడా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగించకుండా...

రహదారి నిర్మించాలని సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి జి.ఎ.కాలనీ, ఎఎస్ఆర్.కాలనీ ఇళ్లు తొలగించకుండా అచ్చంనాయుడులోవ ఇళ్లకు రహదారి ఏర్పాటు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. ఈ మేరకు జి.ఎ.కాలనీ నుంచి ఎఎస్ఆర్ కాలనీ మీదుగా ఎన్‌టిఆర్ కాలనీ వరకు పాదయాత్ర నిర్వహించారు. జగ్గునాయుడు, సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, జోన్ కమిటీ సభ్యులు ఆర్.లక్ష్మణమూర్తి, ప్రాంతీయ కార్యదర్శి ఎల్.కృష్ణ నేతృత్వంలో పాదయాత్ర జరిగింది. ఈ పాదయాత్రనుద్దేశించి జగ్గునాయుడు మాట్లాడుతూ, అచ్చంనాయుడులోవ ఇళ్ల నిర్మాణానికి ఏ రహదారిలో అయితే ఇసుక, సిమెంటు, పిక్కను భారీ లారీలతో గాజువాక మీదగా తీసుకెళ్లారో అదే రహదారిలో రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. అచ్చంనాయుడు లోవ ఇళ్ల నిర్మాణ సమయంలో జి.ఎ.కాలనీ, ఎఎస్ఆర్ కాలనీ మీదుగా ఒక్క లారీ మెటీరియల్ కూడా వెళ్లలేదన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో జి.ఎ.కాలనీ, ఎఎస్ఆర్.కాలనీలో 30, 40 అడుగులకు జివిఎంసి అధికారులు మార్కింగ్ చేశారని, ఈ మార్కింగ్ వల్ల 90 పూర్తిగాను, పాక్షికంగా ఇళ్లు పోతున్నాయని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ఇళ్ల నిర్మాణం కోసం, పిల్లల వివాహం కోసం రూ.లక్షల్లో రుణాలు చేశారని, ఇల్లు తొలగిస్తే తమ బతుకులు ఏమవుతాయని వారంతా ఆవేదన చెందుతున్నారని చెప్పారు.

సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, ఇళ్లు తొలగించకుండా అడ్డుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్నారు. దీనిపై సోమవారం జివిఎంసి మెయిన్ గేటు వద్ద చేపట్టే ధర్నాలో ప్రజలంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఏరియా కార్యదర్శి ఎల్.కృష్ణ మాట్లాడుతూ ఇళ్లు తొలగించకుండా స్థానిక ఎమ్మెల్యే గణబాబు జోక్యం చేసుకోవాలని, అన్ని పార్టీలు, సంఘాలు కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్. కర్రయ్య, ఎ.మహేంద్ర, బి.అర్జునరావు, మద్దు గణేష్, సురేష్, లెనిన్, గణేష్, బి.జగ్గునాయుడు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న కాలనీవాసులతో ఎం.జగ్గునాయుడు తదితరులు

వృత్తిదారుల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- మాధవధార : దోబీఘాట్లు వద్ద పాకలు, షెడ్లు వేసుకొని నివసిస్తున్న రజక వృత్తిదారులకు సర్వే చేసి పట్టాలు మంజూరుచేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్వరపు ఈశ్వరరావు డిమాండ్‌చేశారు. కంచరపాలెంలోని బిఎస్ఆర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సమావేశం జి.కన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, జివిఎంసి 49వ వార్డు పరిధి ఎఎస్ఆర్.నగర్ దోబీ ఘాట్ వద్ద 20 మంది రజక వృత్తిదారులు వృత్తి చేస్తూ తమ కుటుంబాలతో అక్కడే నివసిస్తున్నారని తెలిపారు. సొంత ఇల్లు లేక ఇంటి అద్దె కట్టుకోలేక చాలాకాలంగా ఉంటున్న వారి ఇళ్లకు సర్వే జరిపించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో ఎప్పటినుంచో ఉన్న రజకుల కమ్యూనిటీ హాలును ఇతరులు ఆక్రమించారని, ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 1, 2 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి రజక చైతన్య తరగతుల్లో రజకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.సత్యవతి, జి.ప్రవీణ్‌కుమార్, బి.రత్నం, ఆర్.సీత, పి.దేవుడమ్మ, వై.లక్ష్మి, ఎం.ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా తిప్పల దేవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : గాజువాక నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన ఇంటి వద్ద ఘనంగా జరిగాయి. నియోజవర్గంలోని అన్ని వార్డుల వైసిపి అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు ఆయన ఇంటికి చేరుకున్నారు. జివిఎంసి 87వ వార్డు వైసిపి అధ్యక్షులు బొడ్డ గోవింద్ ఆధ్వర్యాన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్లి దేవన్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ గాజువాక అధ్యక్షులు చిత్రాడ వెంకటరమణ, సెక్రటరీ ఎన్నేటి రమణ, నాయకులు ముద్దపు దామోదర్, పిన్నింటి, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, బొడ్డ వెంకట సూరి పాల్గొన్నారు.

సీతమ్మధార : గాజువాకలో జరిగిన తిప్పల దేవన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలకు వైసిపి అధ్యక్షులు కెకె.రాజు హాజరై సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు.



దేవన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బొడ్డ గోవింద్ తదితరులు

అప్పన్నను దర్శించుకున్న 'కిమిడి'

ప్రజాశక్తి-పేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, సతీమణి కిమిడి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామమల్లిక్‌నాయుడు కూడా దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పిల్లా శ్రీనివాసరావు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు, అర్చక స్వాములు, పిఆర్‌ఒ నాయుడు తదితరులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కళావెంకటరావు దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నప్రసాదానికి రూ.2,00,032 విరాళం

కిమిడి కళావెంకటరావు దంపతులు తమ మనవడు నిఖిలాన్స్ సాయి కళా చంద్రనాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి నిత్యాన్నప్రసాదం నిధికి రూ.2,00,032 విరాళాన్ని అందించారు. విరాళం మొత్తాన్ని దేవస్థానం డొనేషన్ కౌంటర్‌లో చెల్లించి రసీదు తీసుకున్నారు. అనంతరం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి నిత్యాన్నప్రసాదం బాండును వారికి అందజేశారు.

'సాలూరి' గీతాలతో సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : సాలూరి రాజేశ్వరరావు, కోటి స్వర పరచిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరిని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు 19వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బిజెపి నాయకులు చెరువు రామకోటయ్య మాట్లాడుతూ, రాజేశ్వరరావు సంగీతం అన్నీ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తొలుత నిర్వహించిన సంగీత విభావరిలో డిసిప నాయుడు, కృష్ణవేణి మధురం మధురం ఈ సమయం, విశ్వ ప్రసాద్, కోమలి పాడిన కన్నె పిల్లతోటి, సివి.రాజేశ్వరి, నేరెళ్ల రమేష్ పాడిన కొండకోన పాలైన, రామ నరసింహం, రుద్ర వేణి పాడిన నిన్నలేని అందమేదో, శ్రీనివాస్ కుమార్, సాత్విక పాడిన ముందరున్న చిన్నదాన్ని, మనోహర్, షాను పాడిన ప్రియా మహాశయా, పలువురు గాయకులు పాడిన పగలే వెన్నెల, ఏమని పాడెదనో, ఆనంద మానందమాయే, జగమే మారినది వంటి ప్రజాధరణ పొందిన గీతాలను ఆలపించారు. సంఘం వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, సినీ దర్శకులు ఆర్.యాదకుమార్, సన్‌మూర్తి, కొణతాల రాజు, మహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జానకిరామ్

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ఎస్‌సి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 37వార్డు కార్పొరేటర్ చెన్న జానకిరామ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జానకిరామ్ ఆదివారం జిల్లా అధ్యక్షులు కెకె.రాజును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జానకిరామ్‌ను కెకె.రాజు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -తగరపువలస : మొంథా తుపాన్ ముందస్తు చర్యల నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో సంతపేట, కొత్తపేట, చిల్లపేట, తగరపువలస తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గూడు కోసం వేడుకోలు!

- ఏళ్ల తరబడి శిథిల పాకల్లో జీవనం
- తుపాను హెచ్చరికలతో బిక్కుబిక్కుమంటున్న చిన్నబొడ్డేపల్లి ఎస్‌సి కాలనీ జనం
- నిబంధనలతో ఇళ్ల దరఖాస్తుకు మోకాలడ్డు
- ఆదుకోవాలని మొర పెట్టుకుంటున్న దళితులు



పూర్తిగా శిథిలమైన తాటాకుల పాకలో జీవిస్తున్న దళితులు



ఇళ్లు మంజూరు చేయాలని వేడుకుంటున్న చిన్నబొడ్డేపల్లి ఎస్‌సి కాలనీవాసులు

ప్రజాశక్తి-కోటవురట్ల : శిథిల గృహాల్లో నివసిస్తున్న తమకు పునరావాసం కల్పించాలని చిన్న బొడ్డేపల్లి ఎస్‌సి కాలనీ వాసులు వేడుకుంటున్నారు. ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించిన ప్రజాశక్తి ప్రతినిధి వద్ద తమ గోడు, ఆవేదన వెల్లబుచ్చారు.

చిన్న బొడ్డేపల్లి గ్రామంలో ఎస్‌సికాలనీలో 36 కుటుంబాలు జీనం సాగిస్తున్నారు. దాదాపు 30 సంవత్సరాలు క్రితం ఇందిరమ్మ కాలనీ పేరుతో నిర్మించిన ఇళ్లు కావడంతో అన్ని శిథిలావస్థకు చేరుకోవడంతో బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. గడచిన పదేళ్లలో వీరి వసతికష్టాలు మరింత తీవ్రమయ్యాయి. ఇంటిలో సామాన్లు ఉంచుకొని ఇంటి ముందు చిన్న వాలుపాక వేసుకొని జీవనం సాగిస్తున్నా అధికారులుగానీ, నాయకులు గానీ తమవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, పగటిపూట కూలి పనికి వెళ్లి, రాత్రిపూట ఇంటి ముందున్న గుడిసెలో జీవిస్తున్నామన్నారు. దోమలు, పాములు చీమల బెడదతో పాటు ఏ క్షణాన ఇల్లు కూలిపోతుందోనని ఆందోళనతోకాలం వెలదీస్తున్నట్లు కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



ఇంటి బయట పాకలోనే పసిబిడ్డతో దళిత బాలింత

మూడు దశాబ్ధాల క్రితం నిర్మించిన ఇళ్లు నివాసయోగ్యంగా లేక తాము ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ప్రభుత్వపరంగా కొత్త ఇంటికి దరఖాస్తులకు కూడా అవకాశం లేకుండా పోయిందని వారా వాపోతున్నారు. తమకు కాలనీ ఇళ్లమంజూరు చేసినట్లు గత ప్రభుత్వ హయాంలో నమోదు చేయడంతో కొత్త ఇళ్లమంజూరుకు ఆస్కారమేలేదని అధికారులు తేల్చి చెబుతున్నారని అంటున్నారు. రెక్కడితేగానీ డొక్క నిండని పూటకూలీ నిరుపేద జీవనం సాగిస్తున్న తాము కొత్తగా ఇళ్లమంజూరయ్యే పరిస్థితి లేకపోవడం, ఉన్న ఇంట్లో జీవనం దాదాపు కష్టం కావడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వపరంగా అధికారులు, నేతలు తమ దుస్థితిని పరిశీలించి, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నిలువనీడ పరిస్థితుల్లో చిత్తడిగా మారిన పాకల్లోనే కూర్చునేందుకు కూడా పొడి చోటు లేని పరిస్థితుల్లో నిలబడి నిద్రపోతున్నామని వాపోతున్నారు. మొంథా తుపాన్‌కు ముందస్తు హెచ్చరికలు చేస్తున్న ప్రభుత్వ అధికారులు తాము ఎక్కడికి వెళ్లాలో చెప్పాలని, తమ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వీరు వేడుకుంటున్నారు.

దీనిపై తహశీల్దార్ తిరుమలబాబు వద్ద ప్రస్తావించగా, ప్రస్తుతం తుపాన్ హెచ్చరికల్లో భాగంగా సిబ్బందిని అప్రమత్తం చేసి చిన్నబొడ్డేపల్లి పంపించామన్నారు. వారికి రేషన్ సరుకులు అందజేయడంతో పాటు రాత్రి సమయంలో పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మత్స్యకారుల దీక్షకు సంఘీభావం



నిరసన వ్యక్తం చేస్తున్న పూడిమడక మత్స్యకారులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణానికి వ్యతిరేకంగా 42 రోజులుగా శాంతియుత నిరసన దీక్షలు చేస్తున్న నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులకు సంఘీభావంగా ఆదివారం పూడిమడకలో మత్స్యకారులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా మత్స్యకార సంఘ ప్రతినిధులు చౌడిపల్లి అప్పారావు, వాసుపల్లి శ్రీను, చేపల శ్రీరాములు, మెరుగు చినరాజు, ఉమ్మడి అప్పారావు తదితరులు మాట్లాడుతూ, రాజయ్యపేట మత్స్యకారులు దీక్షలకు ప్రభుత్వం స్పందించకపోడం దుర్మార్గమన్నారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో ఉత్పన్నమయ్యే సమస్యలను ప్రస్తావిస్తూ, పరిశ్రమల రాకతో మత్స్యకారుల మనుగడ, జీవనోపాధి కష్టమౌతుందన్నారు. మత్స్యకారుల ఆవేదనను, వారి మనోభిప్రాయాలను గుర్తించి, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును విరమించుకోవడంతో పాటువారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఆందోళనలో మేరుగు అప్పలరాజు, ఏరిపిల్లి ముత్యాలు, ఏరిపిల్లి పైడియ్య, ఏరిపిల్లి భాను, రేవిడి ఆనందరావు, ఈరిజిల అప్పారావు, ఏరిపిల్లి శ్రీను, మేరుగు రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'హ్యాపీ సండే'



బహుమతి ప్రదానంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి వార్డులో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రామజ్యోతి సంస్థ యువకులు ఆధ్వర్యంలో ఆదివారం 'హ్యాపీ సండే' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని యువత, విద్యార్థులు, చిన్నపిల్లలు ఇలా అందరూ సరస్వతీ విద్యానికేతన్ పక్కనున్న ఆటస్థలానికి చేరుకుని రోజంతా సందడి చేశారు. ఈసందర్భంగా పిల్లలకు ఆటలు, పాటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ముఖ్య అతిథులు మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి, తహశీల్దార్ కె.వరహాలు బహుమతులు అందజేశారు. ప్రతి ఆదివారం గ్రామ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు గ్రామజ్యోతి సంస్థ చేస్తున్న కృషిని కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గొర్లె శివనారాయణ మూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో నరసింగబిల్లి హైస్కూల్‌లో 1993 -94 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వమిత్రులంతా ఒక్కచోటుకు చేరి, పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ, పరస్పర యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సందడి చేశారు 31 ఏళ్ల తర్వాత కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

నారా రోహిత్ పెళ్లి వేడుకలో బాలాజీ



రోహిత్ శుభాకాంక్షలు చెబుతున్న డిసిఎంఎస్ చైర్మన్ బాలాజీ

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుని కుమారుడు సినీ హీరో నారా రోహిత్ వివాహ వేడుకలు ఆదివారం హైదరాబాదులో జరిగాయి. ఈ వేడుకల్లోఉమ్మడి విశాఖ డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా రోహిత్‌కు బాలాజీ వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో

నగదు పరిహారమే చెల్లించాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు : రహదారి నిర్వాసితులతో ఆందోళన



నిర్వాసిత రైతులతో ఆందోళనలో రైతుసంఘం నేత అప్పారావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : హైకోర్టు ఆదేశాల ప్రకారం అచ్యుతాపురం, అనకాపల్లి రహదారి విస్తరణ నిర్వాసితులకు నగదు రూపంలోనే పరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఆదివారం తిమ్మరాజుపేట జంక్షన్‌లో నిర్వాసితులతో ఆందోళన చేపట్టారు. హరిపాలెం,చౌడపల్లి తిమ్మరాజుపేట గ్రామాల రోడ్డు విస్తరణ నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో నాలుగు లింక్ రోడ్లు నిర్మాణానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం, దీనిలో ఇళ్లు, భూములు, ఇతర ఆస్తులను కోల్పోయిన నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని ప్రభుత్వం, అధికారులు వెల్లడించారు. అయితే టిడిఆర్ బాండ్లను ఆది నుంచి వ్యతిరేకిస్తూ, 2023 భూసేకరణ చట్టం ప్రకారం నగదు పరిహారం చెల్లించాలని బాధిత నిర్వాసితులు కోరుతున్నారు. టిడిఆర్ బాండ్లు ఇస్తే అవసరానికి వాటిని వినియోగించుకోవడానికి వీలుండదని, వాస్తవ ధరకు బయట మార్కెట్‌లో అమ్ముకోలేని స్థితిలో నిర్వాసితులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. విఎంఆర్‌డిఎ ద్వారా టిడిఆర్ బాండ్లు ఇవ్వాలన్న ప్రతిపాదనను వెనక్కు తీసుకుని నిర్వాసితులు ఎంత మొత్తుకున్నా, నేతలు, అధికారులు వెనక్కు తగ్గకపోవడంతో నిర్వాసితులు ఐక్యపోరాటానికి చేపట్టారు. అందులో భాగంగానే హైకోర్టును కూడా ఆశ్రయించడంతో నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు కాకుండా నగదు చెల్లించాలని సూచనలు చేసిందన్నారు.. హైకోర్టు తీర్పు నిర్వాసితుల ఐక్య పోరాటంలో తొలి విజయమని, దీన్ని సాధించేందుకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితులకు నగదు పరిహారం చెల్లించేంతవరకు స్థలాలు, ఇల్లు వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఆందోళనలో సిపిఎం నేతలు ఎస్ బ్రహ్మాజీ ,కె.సోమ నాయుడు, కడారి అప్పారావు, కాకి శంకర్, ఈ వెంకట రావు, బాబూరాఉ, శివ, గణేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని ఆర్‌వై.అగ్రహారం గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహించే వేడుకలో భాగంగా గ్రామ సాంప్రదాయం ప్రకారం గౌరీ దేవికి ప్రీతికరమైన వరి దుబ్బును పొలాల నుండి సేకరించి, పుర వీధుల్లో డప్పులు వాయిద్యాలతో ఊరేగించి, గౌరీ పరమేశ్వరులకు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండా రమణమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు యడ్ల అప్పారావు, యడ్ల పోతి బాబు, యడ్ల రామకృష్ణ, గ్రామ పెద్దలు , యువకులు, మహిళలు పాల్గొన్నారు.

బదిలీ డిజిటల్ అసిస్టెంట్‌కు సత్కారం



సత్కరిస్తున్న గీత కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో గుర్రాజుపేట సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న సూర్యను ఘనంగా సత్కరించారు .ఇటీవల బదిలీల్లో గుర్రాజుపేట నుంచి రామాపురానికి సూర్య బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సూర్యను గీత కార్మికుల సంఘ ప్రతినిధి గుత్తుర్తి పాండురంగ, రాష్ట్ర యాత సంఘంనాయకులు అంగటి రాము శాలువాతో చిరు సన్మానం నిర్వహించి , మెమొంటో అందజేశారు.

నాసిరకం మద్యం అమ్మితే చర్యలు



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న కూటమి నేతలు, అధికారులు

ప్రజాశక్తి -సబ్బవరం : రాష్ట్రంలో నాణ్యమైన మద్యం మాత్రమే అమ్మాలని, ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని పెందుర్తి నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, ఎపి కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని పలు మద్యం దుకాణాలను స్థానిక ఎక్సైజ్ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపులలో నకిలీ మద్యం అమ్మకాలు జరగకుండా గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మద్యం వినియోగదారులకు 'ఎక్సైజ్ సురక్ష యాప్'పై ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గండి ముత్యాల నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గండి దేముడు బాబు, టిడిపి నేతలు బొండా సత్యారావు, కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, బలిరెడ్డి అప్పారావు, లెక్కల అప్పలనాయుడు, ఆకుల గణేష్, గండి దేముడు బాబు, ఎం అక్కు

ఆలయ కమిటీ చైర్మన్‌గా కొటారు



సాంబశివరావును అభినందిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి,-యలమంచిలి టౌన్ : పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయ ఉత్సవకమిటీ చైర్మన్‌గా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొటారు సాంబశివరావు ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో రానున్న రెండేళ్లకు ఆలయ కమిటీచైర్మన్‌ను సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాంబశివరావుకు పలువురు అభినందనలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, కౌన్సిలర్ కొండబాబు, మడుగుల సత్యనారాయణ, కొటారు నరేష్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రవరం వార్డులో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, సీతారామస్వాముల ఆలయ నిర్మాణాలకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌కు గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసికట్టుగా దేవాలయాలు నిర్మించడం శుభపరిణామన్నారు. రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీనివాసరావు, గొర్లె శివనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి కరణం రవికుమార్, బొద్దపు శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు సేనాపతి తులసీరామ్ యూనిట్ ఇన్‌చార్జి రాజమహేష్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ గ్రౌండ్‌ను శుభ్రం చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు
- పేరుకుపోయిన బాణసంచా వ్యర్థాలతో అవస్థలు

ప్రజాశక్తి-అనకాపల్లి : దీపావళికి బాణసంచా అమ్మకాలకు వ్యాపారులకు అనుమతులిచ్చిన ఎన్‌టిఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు అన్నారు. గ్రౌండ్‌లో పేరుకుపోయిన బాణసంచా వ్యర్థాలు, చెత్తతో క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే దాన్ని తొలగింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టీఆర్ గ్రౌండ్‌ను పరిశీలించారు.



చెత్తతో నిండిన గ్రౌండ్‌ను చూపుతున్న శంకరరావు

ఈ సందర్భంగా మాట్లాడుతూ, దీపావళికి ఇటీవల దీపావళి సందర్భంగా బాణసంచా స్టాల్స్ పెట్టిన యజమానులు చెత్తనంత వదిలి వెళ్లడంతో, ఎన్టీఆర్ గ్రౌండ్ చెత్తతో నిండిపోయింది. క్లీన్ చేయకపోవడంతో చెత్త గ్రౌండ నిండా ఉంది .ఎన్టీఆర్ గ్రౌండ్లో ప్రతిరోజు ఉదయం వాకర్స్, పిల్లలు వ్యాయామం, ఆటలు ఆడుకోవడానికి వస్తున్నారు. ఈ చెత్త వలన ఇబ్బంది పడుతున్నారు. దీపావళి సామాన్లు పెట్టి వేల రూపాయలు లాభాలు ఆర్జించిన యజమానులు చెత్తను యధాలాపంగా వదిలి వెళ్లడం సరైనది కాదు. మున్సిపల్ అధికారులు ఎన్టీఆర్ గ్రౌండ్లో చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలని, దీపావళి బాణసంచా స్టాల్స్ పెట్టిన యజమానులు అందరి దగ్గర ఫీజులు వసూలు చేసి మున్సిపల్ కార్యాలయానికి జమ చేయాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు.

గోవాడ సుగర్స్ పరిరక్షణకు
ప్రజాసంఘాలతో ఆందోళన

- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పోస్టర్ విడుదల చేస్తున్న అమర్‌నాథ్, తదితరులు

ప్రజాశక్తి -చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణకు అఖిలపక్షాలతో కలిసి ఆందోళన చేపడతామని మాజీ మంత్రి చోడవరం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. ఆదివారం చోడవరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ప్రభుత్వ వైద్యకాలేజీల ప్రయివేటీకరణ వ్యతిరేక ఆందోళనకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.90 కోట్ల నిధులు అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం పట్టించుకోకపోగా, రైతులకు కార్మికులకు ఇవ్వాల్సిన రూ.34 కోట్ల బకాయిలు ఏడాదిగా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితులు కల్పించారన్నారు. గోవాడ చక్కెర కర్మాగారంపై ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. సహకార వ్యవస్థకు తీవ్ర వ్యతిరేకి చంద్రబాబు, సుగర్ ఫ్యాక్టరీలన్నీ మూయించేశారని ఆరోపించారు. చోడవరం నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, దీనిపైనా త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆందోళన చేస్తామన్నారు.

28న వైద్యకళాశాల వ్యతిరేక ఆందోళనలు వాయిదా

ప్రభుత్వ వైద్యకాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 28న నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టిన నిరసనలను మొంథా తుఫాన్ కారణంగా వాయిదా వేసినట్లు అమర్నాథ్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైకాపా జిల్లా యూత్ అధ్యక్షులు పుల్లేటి వెంకటేష్, చోడవరం ఎంపీపీ గాడి కాసు, పల్ల నర్సింగరావు, టౌన్ అధ్యక్షులు దేవరపల్లి సత్య, కంచిపాటి జగ్గారావు, పినబోయిన అప్పారావు యాదవ్, కొలిమల్ల అచ్చం నాయుడు, ఒరుగంటి నెహ్రూ,గూనూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

బర్నికాన రాజేష్‌కు నివాళి



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోనిపారిశ్రామిక వేత్త, జయరాం పాల్ట్రీస్ అధినేత, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బర్నికాన సాయినాథరావు కుమారుడు బర్నికాన రాజేష్ జయంతిని ఆదివారం నిర్వహించారు. విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గండి బాబ్జి, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, బర్నికాన రామారావు పాల్గొని రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బర్నికాన రాజేష్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. 500 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. 50 మంది విద్యార్థులకు సుమారు రూ.8 లక్షల స్కాలర్ షిప్‌లు అందజేశారు. బర్నికాన ఇంటి ప్రాంగణంలో బర్నికాన రాజేష్ స్మృతివనం ప్రారంభించారు.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గండి ముత్యాలనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గండి దేముడు, ఎంపిపి బోకం సూర్య కుమారిరాము నాయుడు, గండి రవికుమార్, బొండా సత్యారావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు, కరణం రామానాయుడు, సర్పంచ్ మామిడి శంకర్రావు,పడాల వెంకటరమణ, గవర అప్పారావు, గవర సత్యనారాయణ, రేసుపూడి రమణ, పల్లా తాతారావు కోరాడ శ్రీను, సర్పంచులు, ఎంపిటిసిలు, నేతలు పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రమేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ డాక్టర్ కోమ్మోజు రమేష్ 2025 భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్ అందుకున్నారు. ఈ అవార్డుకు దేశవ్యాప్తంగా 2500 పైగా పేర్లను పరిశీలించగా, వారిలో 200 మందికి ఈ గౌరవం దక్కింది. డాక్టర్.కోమ్మోజు రమేష్ 22 ఏళ్లుగా విద్యా రంగంలో వివిధ హోదాల్లో చూపిన అద్భుతమైన కృషి, నిబద్ధత, ఆవిష్కరణకు ఈ గుర్తింపు లభించింది. 25న హైదరాబాద్ టీ హబ్ వేదికగా జరిగిన బిఇఇఎ-25 అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర విద్యా శాఖ, ఎఐసిటిఇ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, సిఇఒ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, ప్రముఖ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు , ప్రభుత్వ, పరిశ్రమల ప్రముఖులు నుంచి డాక్టర్ .కోమ్మోజు రమేష్ ఈ జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, అవార్డును విద్యాసంస్థల అధినేతలకు, సహచరులకు అంకితం చేస్తున్నట్లు వెల్లడించారు.

చెరుకు కాటా వద్ద వారపుసంత

- ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో స్థల మార్పునకు గ్రామ పెద్దల నిర్ణయం



సంత మార్పుపై సమావేశమైన నాలుగు గ్రామాల పెద్దలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండల కేంద్రంలో చెరకు కాటా వద్ద ప్రతి బుధవారం నిర్వహించే కూరగాయల వారపుసంత మార్పుపై సమీప గ్రామాల నాయకులు సమావేశమై చర్చించారు. చెరకు కాటా సమీపంలో కశింకోట -బంగారుమెట్ట రోడ్‌లో వారపు సంత జరుగుతుంది. సంతరోడ్డుపైనే భూలోకమ్మ గుడి నుంచి రోడ్డుపైనే ఇరువైపులా వారపుసంత నిర్వహణలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వారపుసంత వల్ల ట్రాఫిక్‌జామ్, ఇతర ఇబ్బందులపై చర్చించేందుకు ఆదివారం బుచ్చయ్యపేట, కందిపూడి పోలేపల్లి, దిబిడి, కొండపాలెం తదితర గ్రామాల పెద్దలు సమావేశమ య్యారు. వారపు సంతను ప్రత్యామ్నాయంగా చెరుకు కాటాలో ఏర్పాటు చేయడంపై చర్చించారు. చెరుకు సీజన్‌లో మెయిన్ రోడ్‌పైనా, మిగతా సీజన్‌లో చెరకు కాటాలో వారపుసంత ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. చెరుకు కాటాలో సంత ఏర్పాటుతో ట్రాఫిక్ కష్టాలు ఉండవని అంటున్నారు.

రహదారి భద్రతకు చర్యలు

'స్పిరిట్' సంస్థ ఆధ్వర్యంలో శుభ్రతా పనులు

ప్రజాశక్తి -చోడవరం : స్పిరిట్ ఆఫ్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చోడవరం నుంచి వెంకన్నపాలెం వెళ్లే మార్గంలో కల్వర్టులు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు కొట్టించి బాగుచేయించారు. చోడవరం నుండి వడ్డాది వెళ్లే మార్గంలో విజయరామరాజుపేట వంతెన వద్ద, ఇంకా రహదారిలో ప్రమాదకర పరిస్థితులున్న పదిచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తదుపరి తుపాన్ వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత చోడవరం నుంచి వెంకన్నపాలెం వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా మారిన గుంతలను స్పిరిట్ ఆఫ్ సర్వీస్ ఆధ్వర్యంలో బాగుచేస్తామని సంస్థ వ్యవస్థాపకులు ఆకుల రమేష్ తెలిపారు. తాము చేసే సేవా కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ మాస్టారు, గోవింద మాస్టర్, ఎం సూర్య, ఎస్ శ్రీను పాల్గొన్నారు.

వసతిగృహం..అపరిశుభ్రం..

-మురుగునీరు, గడ్డి, పిచ్చి మొక్కలు దర్శనం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో అపరిశుభ్రం తాండవిస్తోంది. వసతి గృహం పరిసర ప్రాంతం, బయట చెత్తా చెదారంతో నిండి ఉంది. మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దోమలకు నిలయంగా మారింది. వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ హాస్టల్ లేక పోవడంతో 50 మంది ఎస్సీ, 10 మంది బీసీ విద్యార్థులు కలిసి హాస్టల్లో ఉంటున్నారు. వసతి గృహం లో ఖాళీ ప్రాంతం అంతా గడ్డి పిచ్చి మొక్కలతో విస్తరించి ఉంది. వాడుకనీరు బయటకు పోయే మార్గం లేక పోవడంతో మురుగునీరు నిలిచి దోమలకు నిలయంగా మారుతోంది.వసతి గృహం బయట ప్రాంతం



హాస్టల్ భవనం పక్కన నిలిచిన మురుగునీరు



హాస్టల్ భవనం పక్కన చెత్తాచెదారం

చెత్తకుప్పలతో దర్శనమిస్తుంది. చుట్టుపక్కల ఉన్నవారు వసతి గృహం ఉన్న ప్రాంతంలో చెత్తను తీసుకొచ్చి వేయడంతో అపరిశుభ్రం నెలకొంది. పలువురు బయట వ్యక్తులు వసతిగృహం ఎదురుగా ఉన్న తుప్పల్లో బహిర్భూమి కి వెళ్లడంతో వచ్చే దుర్వాసనకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెండు, మూడు రోజులకు కుళాయి ద్వారా వచ్చే నీరును నిల్వ చేసుకుని తాగడం, వాటర్ సరిపోని పక్షంలో మినరల్ వాటర్ కొనుగోలు చేసుకుంటున్నారు. కొత్తగా టాయిలెట్స్ నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ, తుది దశకు చేరుకోక పోవడంతో విద్యార్థులు పాత వాటినే వినియోగిస్తున్నారు. రూముల్లో కిటికీలకు తలుపులు లేక పోవడంతో దోమలు ప్రవేశిస్తున్నాయి. వర్షాకాలం, చలికాలం ప్రారంభమైనప్పటికీ నేటికీ విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు అందలేదు. జాతీయ రహదారిని ఆనుకుని అపరిశుభ్రంగా ఉన్న వసతి గృహాన్ని పట్టించుకునే నాధుడే కరువయ్యారు.

మొంథాపై అప్రమత్తం

-8 ఎన్‌డిఆర్ఎఫ్, 9 ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు
-మూడు రోజులు విద్యాసంస్థలకు సెలవులు
-జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



ప్రజాశక్తి- అనకాపల్లి : బంగాళాఖాతంలో మొంథా సూపర్ సైక్లోన్ ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడించారు. సముద్రంలోకి చేపల వేట నిషేధించారు. బీచ్‌ల్లోకి పర్యాటకుల సందర్శన నిలుపుదల చేస్తారు. అత్యవసర సహాయక చర్యలకు 8 ఎన్‌డిఆర్ఎఫ్, 9 ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధం చేశారు. ఈనెల 27, 28, 29 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ తదితర విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు ఆదేశాలను ఉల్లంఘించి విద్యాసంస్థలను తెరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నిశాఖల అధికారులు, విపత్తుల నిర్వహణ సిబ్బందిని సన్నద్ధం చేశామన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో డిఐజి సమీక్ష

అనకాపల్లి : మొంథా తుపాన్ నేపథ్యంలో విపత్కర పరిస్థితులు ఉత్పన్నమైతే సమన్వయంతో ఎదుర్కొనేందుకు పోలీసుయంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి సూచించారు. ఆదివారం రేంజ్ పరిధిలోని అల్లూరి, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తతతో అందుబాటులో ఉండి సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు.. ప్రతి జిల్లాలో 24/7 కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, తగిన సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

యలమంచిలి : మొంథా తుపాను హెచ్చరికలతో ఆదివారం మున్సిపాలిటీ, మండల అధికార్లు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని ఈదురుగాలులు, వర్షభీభత్సంపై వివరించి అప్రమత్తం చేశారు. తహశీల్దారు కె.వరహాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పులపర్తి, పేట బయ్యవరం, గ్రామాలను సందర్శించి, పరిశీలించారు. పూరిగుడిసెల్లోని వారిని పాఠశాల భవనాలకు చేర్చాలన్నారు. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడే అవకాశం ఉందని, అలాగే విద్యుత్ కోత, రాకపోకల అంతరాయాలపై యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలకు సూచనలు చేశారు. గ్రామ మండల స్థాయి అధికార్లంతా రేయింబవళ్లు తమ పరిధిలోని గ్రామాల్లో విధుల్లో ఉంటారన్నారు

మునగపాక: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు.. శారదా నది పరివాహక గ్రామాలైన గణపర్తి, జి..జగన్నాధపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో, చూచుకొండ ఎన్టీఆర్ కల్యాణ మండపాలలో విఆర్ఒలు, పంచాయతీ సెక్రటరీలు, శానిటేషన్ కార్యదర్శులు ఇన్‌ఛార్జిలుగా మూడు సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందిని కూడా అప్రమత్తం చేసామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్‌రూం 08924-2 57624 సేవలను వినియోగించుకోవాలన్నారు.

నక్కపల్లి:తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సిఐ మురళి, ఎస్ ఐ సన్నిబాబు మత్స్యకారులకు సూచించారు. మండలంలో రాజయ్యపేట తీరంలో ఆదివారం పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గొలుగొండ:తుఫాన్ కారణంగా మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహశీల్దార్ చైన్లు ఆదివారం తెలిపారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. వర్షాల నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా కంట్రోల్ రూమ్ నెంబరు 08932-235256కు లేదా తన నెంబరు 9963122299ను సంప్రదించ వచ్చునన్నారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ మండల విద్యుత్ శాఖ ఏఈ అనూష కోరారు. విద్యుత్ స్తంభాల దగ్గరికి వెళ్లవద్దన్నారు.విద్యుత్తు సమస్యపై ఫోన్: 9440812550కు తెలియజేయాలని సూచించారు.

యస్.రాయవరం: **తుపాన్‌పై** ఆదివారం సాయంత్రం మండల కేంద్రమైన రాయవరంలో అధికారులతో తుపాన్ ప్రత్యేక అధికారి వినయ్ చంద్ సమీక్ష



ఎస్.రాయవరంలో సమీక్షిస్తున్న వినయ్‌చంద్

నిర్వహించారు. రానున్న విపత్తును ఎదుర్కొనేందుకు తుఫాన్ ప్రచారం చేయాలని సూచించారు. తీరప్రాంత గ్రామాలైన బంగారమ్మ పాలెం, రేవు పోలవరం, కొత్త రేవు పోలవరం గ్రామాల్లోని మత్స్యకారులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వివి రమణ, తహసిల్దార్ జె రమేష్ బాబు, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి సౌజన్య విద్యుత్ శాఖ ఏఈ మధు పాల్గొన్నారు.

నక్కపల్లి: రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి విజయ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు.

కశింకోట : ముంచుకొస్తున్న మొంథా తుఫాన్‌తో రైతులు, ప్రజలు ఆందోళనలో ఉన్నారు. అధికార యంత్రాంగం అవసరమైన చర్యలకు ఉపక్రమించినా, ప్రకృతి ప్రకోపం తట్టుకోవడంపై భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పోలీస్, రెవిన్యూ, వివిధ శాఖల అధికారులు తుపాన్‌పై ప్రజలను అప్రమత్తం చేశారు. మంగళవారం కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 90-110 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు వరి, చెరకు, కూరగాయలు, ఇతర పంటల రైతులను గుబులుపుట్టిస్తున్నాయి.

గొలుగొండ:మండలంలోని తాండవ నది ఆయకట్టు సరిహద్దు గ్రామాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి తెలిపారు. ఆదివారం అమ్మపేట గ్రామాన్ని సందర్శించారు. తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు నదిలోకి వెళ్లరాదని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాసరావు ఉన్నారు.



గణేష్‌ను సత్కరిస్తున్న వైసిపి నేతలు

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీలుగా ఇటీవల నియమితులైన మాకిరెడ్డి బుల్లిదొర, పెట్ల అప్పలనాయుడు పార్టీ నాయకులతో కలిసి నర్సీపట్నం మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, పార్టీ బలోపేతం కోసం రానున్న రోజుల్లో మరింత కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అభివృద్ధికి తాను అహర్నిశలు శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, మున్సిపల్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పిల్లలకు కథలు చెబుతున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆసక్తికరమైన కథలు చదివి, వాటిలోని నీతిని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్ పై విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రత్యేక సెషన్ నిర్వహించారు. విజయాన్ని సాధించడానికి ఏ విధంగా చదవాలో, లక్ష్యాన్ని ఎలా సాధించాలో పిల్లలకు వివరించారు. జాతీయ గుమ్మడికాయల దినోత్సవం సందర్భంగా గుమ్మడికాయలతో కలిగే ఉపయోగాలు తెలిపారు. పిల్లలంతా ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు.



ఆహారాన్ని అందిస్తున్న నాయకులు

వృద్ధులకు అల్పాహారం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని అప్పలరాజు పురంలో లలిత దేవి అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పంచకర్ల సందీప్ పుట్టినరోజు సందర్భంగా అల్పాహారం ఏర్పాటు చేశారు. పుట్టినరోజు జరుపుకుంటున్న పంచకర్ల సందీప్ కి వృద్ధులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల జనసేన అధ్యక్షులు జివి మూర్తి, కార్యకర్తలు వెంకటరమణ, గణేష్, నాగరాజు, శివ, ప్రసాద్, రాకేష్, సాయి,స్వామి పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలో పర్యాటక ప్రాంతాలైన చాపరాయి జలపాతం, అరకు పైనరీలో ఆదివారం పర్యాటకుల తాకిడి నెలకొంది. మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో పర్యాటక ప్రదేశాలు సందర్శకులతో కిటకిటలాడాయి. చాపరాయిలో పర్యాటకులు స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. వస్త్ర వేషాధారణ ధరించి దింసా నృత్యాలు ప్రదర్శిస్తూ సందడి చేశారు.

గృహ నిర్బంధం తీవ్రమైన తప్పిదం

▸▸పోలీసులు చట్టాలను చేతిలోకి తీసుకోవడం తగదు ▸▸సిపిఎం నేత అప్పలరాజుకు లాయర్ల బృందం పరామర్శ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: పోలీసుల గృహ నిర్బంధంలో ఉన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజును ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం గ్రామంలో పోలీసులు గృహ నిర్బంధం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం ఆలిండియా లాయర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర హై కోర్టు ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో రాష్ట్ర హైకోర్టు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కోర్టు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా న్యాయవాదులు ఆదివారం సిపిఎం నేత అప్పలరాజును పరామర్శించారు. అనంతరం రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, పోలీసులు వారాల తరబడి వ్యక్తులను నిర్బంధించమని ఏ చట్టంలో లేదన్నారు. స్థానిక పోలీసులు అప్పలరాజు ను రెండు వారాలు గా చట్టాలను ఉల్లంఘించి గృహ నిర్బంధం లో ఉంచి తీవ్రమైన తప్పిదం చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు తమ సమస్యలపై నిరసన తెలిపే హక్కు ఉందని, ప్రజలు చేస్తున్న న్యాయ మైన పోరాటానికి వ్యక్తులు, పార్టీ లు, సంస్థలు మద్దతు ఇచ్చే హక్కు ఉందన్నారు. పోలీసులు చట్టాలను చేతిలో కి తీసుకొని హక్కులను కాలరాస్తున్నారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఈ విధంగా నిర్బంధానికి పాల్పడ్డ పోలీసులు న్యాయ స్థానములో సమాధానం చెప్పాల్సి ఉంటుందని తెలిపారు. మీకు మేమంతా అండగా ఉంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజుకు, కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు వెంకటేశ్వరరావు, సురేష్ కుమార్, చిట్టిబాబు,ఎ.వై.మణి, బి.తులసీదాసు, పూర్ణిమ, బి.సంతోష్ కుమారి,సంతోష్ లక్ష్మి, జ్యోతి, భాస్కరా చార్యులు, రమణారావు, అప్పలరెడ్డి, సురేష్, కె.రాఘవేంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, కె.శ్రీను, సి.హెచ్.రమణ పాల్గొన్నారు.



సిపిఎం నేత అప్పలరాజును పరామర్శిస్తున్న లాయర్ల బృందం సభ్యులు

ఉప్పుటేరులో చేపలు చనిపోతున్నాయి

లాయర్ల బృందానికి విన్నవించిన మత్స్యకారులు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట లో ఉప్పుటేరులో కాలుష్యం కారణంగా మృతి చెందిన చేపలను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కేంద్ర పరిపాలన కమిటీ అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్, లాయర్ల బృందం పరిశీలించింది. ఆదివారం వారు బల్క్ డ్రగ్ వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన శిబిరాన్ని సందర్శించారు. హేటరో కంపెనీ కాలుష్య వ్యర్థ జలాలు ఉప్పుటేరులో కలవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని, దీంతో ఉపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు మైలపల్లి మహేష్ బాబు, పిక్కి తాతీలు తదితరులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. 500 ఎకరాల్లో ఉప్పుటేరు ఉందని, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సముద్రంలో వేటకు వెళ్లే అవకాశం లేని సమయంలో ఉప్పుటేరులో వేట చేసుకుంటూ జీవనం సాగి స్తామన్నారు. వర్షం కురిసినప్పుడల్లా హెటిరో కంపెనీ కాలుష్య వ్యర్థ జలాలు ఉప్పుటేరులో కలవడంతో ఇప్పటికే అనేకసార్లు చేపలు మృత్యువాత పడ్డాయని, ఈ నీరు తాగడంతో ఆవులు కూడా చనిపోవడం జరిగిందని లాయర్ల దృష్టికి తీసుకువెళ్లారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ హైకోర్టు ఎడ్యుకేట్, పిఠాపురం న్యాయవాదుల సంఘం అడ్వకేట్ రాష్ట్ర కార్యదర్శి ఐలు భాస్కరాచార్యులు, విశాఖపట్నం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లు సురేష్, నూకల వెంకటేశ్వరరావు, విశాఖ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, ఐలు ప్రతినిధులు పూర్ణిమ, కేవై మణి, సంతోషి, విశాఖపట్నం, గాజువాక న్యాయవాదుల సంఘం ప్రతినిధులు సంతోషి, చిట్టిబాబు పాల్గొన్నారు.



అప్పలరాజుతో మత్స్యకారులు

మాజీ మంత్రి అప్పలరాజును కలిసిన మత్స్యకారులు

ప్రజాశక్తి-పాయకరావుపేట: పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని చేస్తోన్న పోరాటం, బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం జరిగితే మత్స్యకారులకు జరిగే నష్టాన్ని ఆదివారం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కలసి వివరించామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపిల్లి శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు త్వరలో రాజయ్యపేట వచ్చి సంఘీభావం తెలియజేసి పార్టీ పెద్దలుతో చర్చించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దగ్గరికి తీసుకొని వెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపిల్లి శ్రీనివాస్, రాజయ్యపేట మత్స్యకారులు వై నాగేష్, పి నాగరాజు, వై కోటయ్య, కెవెంకటేష్, జె అప్పలరాజు, బి కాశీ, డి నానాజీ, సిహెచ్ కాశి, ఎమ్ రాము పాల్గొన్నారు.



108 వాహన సిబ్బందికి సూచనలు ఇస్తున్న బాలరాజు

108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

-కంపెనీ జనరల్ మేనేజం బాలరాజు

ప్రజాశక్తి-కొత్తకోట: భవ్య సంస్థ ఆద్వర్యంలో నడుస్తున్న 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు అప్రమత్తంగా ఉండాలని కంపెనీ జనరల్ మేనేజర్ జి. బాలరాజు అన్నారు. రోలుగుంట పరిధిలో 108 సేవల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాణ ప్రాయ స్థితిలో సమాచారం అందిన వెంటనే స్పందించాలని సూచించారు. అనంతరం పిసిఆర్ డాకుమెంటాషన్ రికార్డులతో పాటు ఇఎస్టి కేసులు, వాహన ట్రాకింగ్, చంధానం, స్టాక్ రిజిస్టర్ అప్డేట్ పై పరిశీలించి సిబ్బంది కి పలు సూచనలు చేసారు.. కేసు సమాచారం అందిన వెంటనే కాలర్‌తో ఫాలో - అప్ కాల్ ఇవ్వడం, విలైనంత తొందరగా మీ వద్దకు మేము చేరుకుంటామంటూ భరసా ఇవ్వాలన్నారు. విల్డ్ ఆపరేషన్లో సిబ్బందికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సిబ్బందికి అధికారి బాలరాజు హామి ఇచ్చారు..



సత్కరిస్తున్న నాయకులు

సిఐ మురళికి సత్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి సిఐగా బాధ్యతలు చేపట్టిన జే.మురళిని ఆదివారం నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో టిడిపి శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, నాయకులు నూకరాజు, సురేష్ వర్మ, లోవరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ అప్పారావు

పాఠశాల నిర్వహణ, పరిపాలనపై శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : పాఠశాలల నిర్వహణ, పరిపాలన పట్ల ఉపాధ్యా యులు బాధ్యతతో ఉండాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పొన్నాడ అప్పారావు అన్నారు. అనకాపల్లిలోని జివిఎంసి పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి హెచ్ఎంలు, ఎంఇఒలకు పాఠశాల పరిపాలనాంశాలపై ఒక రోజు శిక్షణా జరిగింది. ఎపి హెచ్ఎంల సంఘం అనకాపల్లి జిల్లా ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు ప్రారంభించారు. విశ్రాంత హెచ్ఎం జెఎస్ శాస్త్రి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఏ శ్రీధర్‌రెడ్డి, హెచ్ఎంలు కోడి శ్రీనివాసరావు, కె రామకృష్ణారావు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించినారు. 67 మంది హెచ్ఎంలు, ఎంఇఒల పాల్గొన్నారు.

ప్రయాణ పాట్లు

- సమయానికి బస్సులు రాక ఇక్కట్లు
- గంటల తరబడి నిరీక్షణ, పడిగాపులు
- రద్దీ నివారణ చర్యలు చేపట్టాలని వినతి



కిక్కిరిసిన బస్సులో ఎగబడి ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం ప్రయాణికుల రద్దీ గణనీయంగా కనిపించింది. విశాఖ వెళ్లే బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రజలు గంటల తరబడి పడిగాపులు పడ్డారు. ముఖ్యంగా కృష్ణరాయుడుపేట వంతెన పనులు నెలలుగా నిలిచిపోవడంతో రోడ్డు మార్గం పూర్తిగా మూసేశారు. ఫలితంగా విశాఖ వెళ్లే 12డి సహా మిగతా అన్ని బస్సులు కె.కోటపాడు మీదుగా రాకపోకలు సాగించక తప్పడం లేదు. దీంతో సాధారణంగా దేవరాపల్లి నుంచి విశాఖకు గంటన్నర సమయం పట్టాల్సిన ప్రయాణం, ఇపుడు రెండు గంటలు దాటిపోతోందని పలువురు వాపోతున్నారు. కృష్ణరాయుడుపేట మీదుగానేరుగా కాకుండా చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడం, రోడ్డు బాగాలేకపోవడం వల్ల ప్రయాణం మరింత క్లిష్టంగా మారింది. దీంతో బస్సులు ఆలస్యంగా రావడంతో బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజు కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు, విధులకు హాజరయ్యేందుకు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవులు, పండగ సమయం కావడంతో ప్రయాణికుల రద్దీ బాగాపెరగడం, దానికి తగ్గట్టుగా బస్సులు నడపకపోవడం వల్ల ఇబ్బందులు తప్పడంలేదు. అంతేకాక బస్సుల్లో కిక్కిరిసన ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌టిసి అధికారులు రద్దీ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టి, సకాలంలో గమ్యం చేరేందుకు, సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు. అంతేకాక కృష్ణరాయుడు వంతెన పనులు పూర్తి చేస్తే ప్రయాణసమయం కూడా తగ్గుతుందని అంటున్నారు.